లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సును ప్రశాంతంగా జరుపుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, అక్టోబర్ 13: నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో గల హజరత్ సయ్యద్ లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉర్సుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి జరిగే ఉర్సుకు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులు మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ సమద్, ఉర్సు కమిటీ సభ్యులు ఇంతియాజ్ హుస్సేన్, ఇర్ఫాన్, ముతవల్లీలు సమీవుల్లా ఖాద్రి, గౌస్ ఉల్లా ఖాద్రి, కౌన్సిలర్ నవీన్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

నిడమనూరు, అక్టోబర్ 13 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముకుందాపురం గ్రామానికి చెందిన షేక్ కాఫిర్ కుటుంబానికి సంగారెడ్డి జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి అండగా నిలిచారు. ఆదివారం స్వగ్రామానికి వచ్చిన ఆయన కాఫిర్ కుటుంబాన్ని పరామర్శించి వన్ చాలెంజ్ ఫౌండేషన్ తరుపున రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. కాఫిర్ కుటుంబానికి అండగా ఉంటానని, ఇంటి నిర్మాణం, పిల్లల చదువులకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గండికోట యాదగిరి, సయ్యద్ జాన్, షేక్ సలీం, షేక్ ఇబ్రహీం, షేక్ జానిమియా, షేక్ అక్బర్, బొడ్డుపల్లి శ్రీను, ముస్తఫా, హుస్సేన్, గండికోట శివ పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరమేశ్‌యాదవ్

పరమేశ్‌కు నియామకపత్రం అందిస్తున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి

రామగిరి, అక్టోబర్ 13: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా తరాల పరమేశ్‌యాదవ్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు అందించారు. జిల్లా కేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా పరమేశ్‌యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘంజిల్లా అధ్యక్షుడు నిమ్మనగోటి జనార్ధన్, రాష్ట్ర కార్యదర్శి బి.సూర్యనారాయణ, దొడ్డిని సాయిబాబు, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ముప్పిడి మల్లయ్య, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తంతెనపల్లి సైదులు పాల్గొన్నారు.

భక్తియోగ కేంద్రం ప్రారంభం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

హాలియా, అక్టోబర్ 13 : హాలియాలో ఏర్పాటు చేసిన ఇస్కాన్ భక్తియోగ కేంద్రాన్ని ఆదివారం ఇస్కాన్ వర్ణాశ్రమ మినిస్టరీ ఇండియన్ డైరెక్టర్ రాంలక్ష్మణ్ దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి భగద్గీత జ్ఞానాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి నెల మూడో వారంలో మూడు రోజుల పాటు గీత ప్రవచనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, డాక్టర్ కత్తి కోటిరెడ్డి, దంతవైద్యుడు రాఘవేంద్ర జలపాటి, యోగా మాస్టర్ మహ్మద్ జాని, చామకూరి లింగారెడ్డి, అనిల్‌రెడ్డి, జయవర్ధని, రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

జనగాం రాములు విగ్రహావిష్కరణ

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మునుగోడు, అక్టోబర్13 : మండలంలోని రత్తిపల్లి మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధుడు జనగాం రాములు విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయగా ఆదివారం స్థానికులు, నాయకులు ఆవిష్కరించి నివాళులర్పించారు. ఆయన గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గీత పనివారాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, డీసీసీ మాజీ అధ్యక్షుడు సుంకరి మల్లేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ పాలగోని సత్యంగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు పాలకూరి యాదయ్య, సురిగి చలపతి, పాలగోని సైదులు, పోగుల ప్రకాశ్, ఈదులకంటి కైలాశ్, తీర్పారి వెంకటేశ్వర్లు, కుంభం భూపాల్‌రెడ్డి, నిమ్మల అంజయ్యగౌడ్, జనగాం అంజయ్య పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు మహిధర్ ఎంపిక

మిర్యాలగూడ, అక్టోబర్ 13 : ఈ నెల 10న సూర్యాపేటలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో అండర్-14 క్రికెట్ క్లియోస్పోర్ట్స్ విద్యార్థి కె.మహిధర్‌రెడ్డి ప్రతిభ కనబర్చి కీపర్, బ్యాట్స్‌మెన్‌గా ఎంపికైనట్లు కోచ్‌లు వెంకన్న, రాజు తెలిపారు. సోమవారం గద్వాల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మహిధర్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు తరపున పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మొదటి స్టాండ్‌బైగా యశ్వంత్‌ను కూడా ఎంపిక చేసినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఆదివారం క్లియో స్పోర్ట్స్ ప్రతినిధి ఎం.రామ కృష్ణ అభినందించారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో వాహన, ఆయుధ పూజలు

రామగిరి, అక్టోబర్ 13: తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా దసరా ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. 9 రోజుల బతుకమ్మ సంబురాల అనంతరం శనివారం పదో రోజు విజయదశమి వేడుకలు వైభవంగా సాగాయి. వివిధ ప్రాంతాల్లో ఉండి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే వారు పండుగకు తమ సొంతూళ్లకు రావడంతో గ్రామాల్లో సందడి కనిపించింది. సాయంత్రం శమీ పూజలు నిర్వహించారు. జమ్మి చెట్టును పూజలు చేశారు. ఆలయాల్లో దైవ దర్శనం కోసం భక్తులు బారులు దీరారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పాలపిట్ట దర్శనం ఏర్పాటు చేశారు. దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు తెల్లవారు జాము నుంచి తరలివచ్చి వాహన పూజలు చేయించుకున్నారు. చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం, వాడపల్లి మీనాక్షి అగస్తేశ్వరస్వామి, లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

విజయదశమిని పురస్కరించుకుని శనివారం నల్లగొండలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్మ్డ్ విభాగంలో ఆయుధ, వాహన పూజలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ నిర్వహించారు. అనంతరం దుర్గామాతకు ప్రత్యేక పూజలు కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ రమేశ్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ రాఘవులు, డానియేల్, ఆర్ఐలు సంతోశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరకొండ : దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలూనాయక్, నాయకులు

నకిరేకల్ : శమీపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్మన్ చెగోని రజిత

శాలిగౌరారం : తిరుమలరాయినిగూడెంలో ఆయుధ పూజలో పాల్గొన్న భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

మునుగోడు : కనుకదుర్గ ఆలయం వద్ద రావణ దహనం

మిర్యాలగూడటౌన్ : ఎన్‌ఎస్పీ మైదానంలో క్రాకర్స్ షో

మిర్యాలగూడ టౌన్ : దసరా ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

రామగిరి : నల్లగొండ పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీసులు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టులో శమీ పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు

కేతేపల్లి : కొత్తపేటలో జమ్మిచెట్టు వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న ప్రజలు

కట్టంగూర్ : శమీ పూజలో పాల్గొన్న మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

నల్లగొండలోని రామాలయంలో శమీ పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, స్థానికులు

పెద్దవూర: వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి

హాలియాలో జమ్మి పూజలో పాల్గొన్న నాయకులు, స్థానికులు

నల్లగొండలో శమీపూజలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కౌన్సిలర్ కవితాదయాకర్

నల్లగొండలోని వివేకానందనగర్‌లో దసరా ఉత్సవాలకు హాజరైన ప్రజలు

వీటీ కాలనీలోని వెంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న స్థానికులు

నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న కాలనీ వాసులు

నకిరేకల్ : షిరిడీ సాయి మందిరంలో మహిషాసురుడి ఫ్లెక్సీని దహనం చేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

అంశల స్వామి తండ్రి సత్యనారాయణ మృతి

మర్రిగూడ,అక్టోబర్ 13 : ఫ్లోరోసిస్ బాధితుడు, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట యోధుడు అంశల స్వామి తండ్రి అంశల సత్యనారాయణ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని శివన్నగూడెం గ్రామానికి చెందిన సత్యనారాయణ తన కొడుకుతో పాటు కృష్ణా జలాల సాధన ఉద్యమంలో పాల్గొన్నారు. అంశల స్వామి గత సంవత్సరం జనవరి 28న మృతి చెందాడు. అంశల స్వామికి గతంలో మాజీ మంత్రి కేటీఆర్ హెయిర్ కటింగ్ సెలూన్ ఏర్పాటు చేసి ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్రూం ఇంటిని నిర్మించి ఇచ్చి గృహ ప్రవేశానికి కూడా హాజరయ్యారు. స్వామి కుటుంబానికి కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సాయాన్ని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. అంశల సత్యనారాయణ మృతికి జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ,ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకట్ల సుభాశ్, మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీలతాసురేందర్‌రెడ్డి, చెర్కు లింగగౌడ్ సంతాపం తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

నకిరేకల్, అక్టోబర్ 13 : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు పుట్ట లక్ష్మయ్య ఆదివారం తన వ్యవసాయ బావి వద్ద తాటిచెట్టు ఎక్కుతూ కాలిజారి పడిపోయాడు. దాంతో అతడి తల, మెడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మద్యం దుకాణంలో చోరీ

రూ. 10.84 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు

గుర్రంపోడ్, అక్టోబర్ 13: మండల కేంద్రంలోని ఆదిత్య వైన్స్‌లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి రూ.10.84 లక్షలను ఎత్తుకెళ్లాడు. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఆదిత్య వైన్స్ సిబ్బంది దసరా పండుగ రోజు రాత్రి వరకు షాపు నిర్వహించారు. అనంతరం రెండు రోజుల కలెక్షన్ డబ్బులను వైన్స్‌లోనే ఉంచి షాపు మూసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వైన్స్ తాళాలు తీసి చూడగా షాపు పైకప్పు రేకుకు రంధ్రం చేసి ఉండడం, కౌంటర్‌లో ఉంచిన డబ్బులు కనిపించక పోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు షాపునకు చేరుకుని సీసీ పుటేజీని పరిశీలించారు. గుర్తుతెలియని అగంతకుడు తన ముఖానికి దస్తీ కట్టుకొని షాపు పైకప్పు రేకునకు రంధ్రం చేసి లోపలి ప్రవేశించినట్లు, టేబుల్ డ్రాలో ఉంచిన డబ్బును తీసుకొని వెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. కొండ మల్లేపల్లి సీఐ ధనుంజయతో పాటు ఎస్ఐలు వచ్చి వివరాలు సేకరించారు. వైన్స్ నిర్వాహకులు పొనుగోటి నర్సింహారావు, పొలమోని రాంబాబు ఫిర్యాదు మేరకు

కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పండుగపూట విషాదం

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్13 : బైక్‌ను టాటా లీలాండ్ వాహనం ఢీకొనడంతో ఒక మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రాయినిపాలెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ పి.లోకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయినిపాలెం గ్రామానికి చెందిన బూర నాగయ్య(30), బూర సైదులు దసరా పండుగ సామాను కొనుగోలు చేసేందుకు బైక్‌పై మిర్యాలగూడ పట్టణానికి వచ్చారు. కిరాణా సామాను కొనుగోలు చేసి ఇంటిని బయల్దేరారు. రాయినిపాలెం గ్రామ శివారులో టాటా లీలాండ్ వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దాంతో బైక్ నడుపుతున్న నాగయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న సైదులుకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడ ఏరియా దవాఖానకు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మర్రిగూడ : బైక్ ఢీకొని మండలంలోని తూర్పుతండాకు చెందిన జరుపుల బిచ్యానాయక్(35) శనివారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుతండాకు చెందిన బిచ్యానాయక్ కొండూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శనివారం దసరా రోజున బైక్‌పై మండల కేంద్రానికి వచ్చి తిరిగి తండాకు బయల్దేరాడు. దొర్నాలబావి కుంట వద్దకు రాగానే కొండూరుకు చెందిన దుబ్బ శివ బైక్‌పై వస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంలో బిచ్చునాయక్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అతడి కుటుంబ సభ్యులు నిందితుడు శివ ఇంటి ఎదుట ధర్నా చేశారు. పోలీసుల జోక్యంతో ఆందోళన విరమించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

ముగిసిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

దుర్గామాత పూజల్లో పాల్గొన్న మాజీఎమ్మెల్యే గాదరి కిశోర్

రాక్‌హిల్స్ కాలనీలో నిర్వహించిన దుర్గాదేవి విగ్రహ నిమజ్జన శోభాయాత్ర

రామగిరి, అక్టోబర్ 13: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. దాంతో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు పలు దేవాలయాలతోపాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు, భవానీదీక్ష స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలు చేశారు. తొమ్మిది రాత్రులు పూజలందుకున్న అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా నిమజ్జన శోభాయాత్ర ద్వారా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, తీన్మార్ స్టెప్పులు, కోలాట ప్రదర్శనలతో శోభాయాత్ర వైభవంగా సాగింది.


విద్యార్థిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థికి సన్మానం

చండూరు,అక్టోబర్13: మండలంలోని నెర్మట గ్రామానికి చెందిన నాగిళ్ల యశ్వంత్ సాయి ఇటీవల నిర్వహించిన ఎంబీబీఎస్ కౌన్సిలింగ్‌లో ప్రతిమ కాలేజ్ కరీంనగర్‌లో సీటు సాధించాడు. విద్యార్థిని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళా వెంకన్న శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాపోలు ప్రభాకర్, సంగెపు మల్లేశ్, సందీప్, పవన్ సాయి, మల్లేశ్ పాల్గొన్నారు.

దుర్గామాత వస్త్రాలు, ఆభరణాల వేలం

హాలియా, అక్టోబర్ 13 : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహింపేట గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చీరెలు, ముక్కు పుడక, కంకణం, మణిమాలను వేలం వేయగా రూ. 1.67 లక్షలకు భక్తులు వేలం పాడి వాటిని దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి విగ్రహాన్ని శోభాయాత్ర ద్వారా నిమజ్జనానికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శాలిగౌరారం, అక్టోబర్13 : మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన శెనిగె నాగరాజు(38) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తనకు సంబంధం లేకున్నా డీజిల్ దొంగతనం పేరుతో తిరుమలగిరి ఎస్ఐ తీవ్రంగా కొట్టాడని మనస్థాపానికి గురైన నాగరాజు ఈ నెల 4న ఆత్మహత్యా యత్నం చేసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి హైదరాబాద్ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

కూరెళ్లకు ఘన సన్మానం

కూరెళ్లను సన్మానిస్తున్న దుర్గాప్రసాద్

రామగిరి, అక్టోబర్ 13 : ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్యను ఆదివారం గ్రంథ పాలకుడు ఆనందం దుర్గాప్రసాద్ ఘనంగా సన్మానించారు. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు తపతి, స్వామి, నవనీత, యోగేశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారికి సన్మానం

ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

గుర్రంపోడ్, అక్టోబర్ 13 : డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు పొందిన మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన నల్లబోతు శివ, పెద్దిరెడ్డి సతీశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి హారిక, పెద్దిరెడ్డి శైలజ, పోలీస్ శాఖలో ఉద్యోగం పొందిన జెల్లా నాగరాజు, ఐతరాజు సాయిని ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు బొమ్ము శ్రీనివాస్, ఐతగోని వెంకటేశంగౌడ్, బొమ్ము నగేశ్, కృష్ణ గౌడ్, నాగార్జున, సింగం ప్రవీణ్, కృష్ణ, నరేశ్, సత్యం, జనార్ధన్, పాండు, శ్రీకాంత్, యువ జన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శాలిగౌరారం : సమ్మేళనంలో పాల్గొన్న శాలిగౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 టెన్త్‌బ్యాచ్ పూర్వవిద్యార్థులు, వారికి చదువు చెప్పిన గురువులు

సమ్మేళనంలో పాల్గొన్న నకిరేకల్‌లోని సరస్వతి హైస్కూల్ 2007-08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు, వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 6304222202.
NT-338782

CHANGE OF NAME
★I, Mohammad husamoddin (Old Names) S/o. Mohammad Ekramoddin, R/o.H.No.6-4-101, Street : Arfathpura, Mandal: KORATLA-505326, District Jagtial, Telangana, Have Changed My Name as MOHAMMAD HUSSAM UDDIN
NTK-325721

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు ఇంపైనరీని సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, ప్లాట్ నం 2వ పల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | సూర్యాపేట : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | కోదాడ : 9182777636 | తుంగతుర్తి : 9182777636
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777636 | కోదాడ : 9182777636